# భూ సంస్కరణలు

'భూ సంస్కరణలను ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల కోణంలో విశ్లేషించాల్సి ఉంటుంది. భూసంస్కరణలు వ్యవసాయాభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికే కాకుండా సాంఘిక న్యాయాన్ని సాధించడానికి, గ్రామీణాభివృద్ధికి, రాజకీయ అధికారంలో మార్పులు తీసుకురావడానికి దోహదపడతాయి. వ్యవసాయరంగ ప్రాధాన్య ఆర్థిక వ్యవస్థ నుంచి పారిశ్రామిక, సేవారంగ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందాలంటే భూ సంస్కరణల్లో విప్లవాత్మక మార్పులు అవసరం. భూ సంస్కరణలు అనేవి నిర్మాణాత్మక మార్పులకు సంబంధించినవి. వ్యవసాయ రంగంలో వెనుకబాటుతనానికి ఫ్యూడల్, సెమీఫ్యూడల్ విధానాలే కారణం. వీటిని నిర్మూలించడానికి నిర్మాణాత్మక మార్పులు తప్పనిసరి.

★ వ్యవసాయ రంగంలో తక్కువ ఉత్పాదకత, వెనుకబాటు లాంటి కారణాలను నివారించడానికి భూసంస్కరణలు అవసరమయ్యాయి. ఇంకా..

★ వ్యవస్థాపూర్వక అంశాలైన భూస్వామ్య పద్ధతులు, కౌలు విధానాలు, భూ యాజమాన్య కేంద్రీకరణను నివారించడం లాంటి అంశాలపై దృష్టి సారించడానికి

★ వివిధ మధ్యవర్తిత్వ విధానాలైన జాగీర్దార్లు, జమీందార్లు, ఇనాందార్ల లాంటివారి జోక్యాన్ని తగ్గించడానికి

★ వివిధ రాజకీయ అంశాలు, పార్టీల విధానాలు, రైతాంగ ఉద్యమాలు లాంటి పరిస్థితుల వల్ల భూ సంస్కరణలు తప్పనిసరి అయ్యాయి.

★ సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో 1948 – 73 మధ్య మొదటి దఫా భూ సంస్కరణలు, 1970 – 80 దశకం మధ్యలో రెండోదశ భూ సంస్కరణలు అమలయ్యాయి.

★ భారత రాజ్యాంగం 39వ అధికరణ (బి, సి)లో భౌతిక వనరులపై యాజమాన్యం, నియంత్రణ అంశాలకు సంబంధించి జాతులన్నింటికీ ప్రయోజనం కలిగేలా న్యాయంగా పంచాలని పేర్కొంది.

★ సామాజిక న్యాయం, ఆదాయ అసమానతలను తొలగించడం లాంటి లక్ష్యాలతోపాటు భూ సంస్కరణల ద్వారా నిర్మాణాత్మక, వ్యవస్థాపూర్వక మార్పులు సాధించాల్సి ఉంది.

★ కమతాల గరిష్ఠ పరిమితి, కౌలు భద్రత, మధ్యవర్తుల తొలగింపు లాంటి ప్రధానాంశాలే కాకుండా ప్రస్తుతం భూములకు సంబంధించిన రికార్డుల కంప్యూటరీకరణ, పట్టాదారు పాస్ పుస్తకాలు, గిరిజన భూముల భద్రత కూడా ప్రధాన అవసరంగా మారింది

★ కౌలుదార్లకు రక్షణ కల్పిస్తూ, వ్యవసాయ కూలీలకు, సన్నకారు రైతులకు భూమిని పునఃపంపిణీ చేయాల్సి ఉంది.

★ వ్యవసాయ రంగంలో ఉన్న అన్ని రకాల దోపిడీలను, సాంఘిక అన్యాయాలను తొలగించి భూమిని దున్నేవారికి పూర్తి రక్షణ, హక్కులను కల్పించాల్సిన అవసరం ఉంది.

★ వ్యవసాయ రంగంలో వంశపారంపర్యంగా వచ్చిన ఏ ప్రతిబంధకాలైతే వ్యవసాయాభివృద్ధిని తగ్గిస్తున్నాయో వాటిని తొలగించాల్సిన అవసరం ఉంది.

★ రైతాంగం ఆర్థిక, సామాజిక, రాజకీయ శక్తిని శక్తిమంతం చేయాలని జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నారు.

★ భూమిని దున్నేవారికి - ప్రభుత్వానికి మధ్య మెరుగైన సంబంధాలు, భూమి యాజమాన్యం, నిర్వహణలో నిజమైన సాగుదారుడికి మేలు కలిగించే రీతిలో మార్పులు తీసుకురావాల్సి ఉంది.

★ మధ్యవర్తుల తొలగింపు, భూహక్కుల పునఃపంపిణీ, కమతాల సమీకరణ, కౌలు సంస్కరణలు, సహకారం లాంటివి ప్రధానమైనవని ప్రొ. రాజ్‌కృష్ణ పేర్కొన్నారు.

★ ప్రధానంగా భూమి పునఃపంపిణీ, కౌలు పరిమాణ నిర్ణయం, కౌలుదారుకు భద్రత, వ్యవసాయ కార్మికుల వేతన నిర్ణయం, వ్యవసాయ పరపతి ఆధారాల అభివృద్ధి, భూమి పన్నుల విధానంలో మార్పులు అవసరమని, సహకార వ్యవస్థ, వ్యవసాయ విద్యలో సాంకేతిక మార్పులు తీసుకురావాలని ఐక్యరాజ్య సమితి (UNO) పేర్కొంది.

**భూ సంస్కరణలకు దారితీసిన పరిస్థితులు:**

భూస్వామ్య పద్ధతులు, కౌలు విధానాలు, భూ యాజమాన్య కేంద్రీకరణ లాంటి వ్యవస్థాపూర్వక అంశాలు, రాజకీయ విధానాలు, తీర్మానాలు, రైతాంగ ఉద్యమాలు భూ సంస్కరణలకు దారితీశాయి.

★ జమీందారీ, ఇనాందారీ, రైత్వారీ లాంటి భూస్వామ్య పద్ధతులను అధ్యయనం చేయడం ద్వారా ఈ సంస్కరణలకు కారణమైన పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు.

## భూస్వామ్య పద్ధతులు

**జమీందారీ పద్ధతి:**

1793లో కారన్ వాలీస్ శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతికి అనుగుణంగా 1802లో మద్రాస్ శాశ్వత శిస్తు చట్టాన్ని అనుసరించి జమీందార్లకు వంశపారంపర్యపు హక్కు లభించింది.

★ మద్రాస్ ప్రెసిడెన్సీలో మొత్తం విస్తీర్ణంలో 152 లక్షల ఎకరాలు, మొత్తం భూభాగంలో 70% ఆంధ్ర ప్రాంతంలో ఉండేది.

★ జమీందార్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన 'పేష్కస్' పన్ను రూపంలో రైతులను దోపిడీ చేసేవారు. ఈ విధంగా మునగాల పరగణా, విజయనగరం జమీందారు, పిఠాపురం జమీందార్లు తమ ఆదాయాలను లక్షల్లో పెంచుకున్నారు.

★ దీనిలో లోపాలను సరిదిద్దడానికి 1805లో ప్రభుత్వం జమీందార్లకు అనుకూలంగా రెంట్ రికవరీ చట్టం, 1908 మద్రాస్ ఎస్టేట్ లాండ్ చట్టం చేసింది.

**ఇనాందారీ వ్యవస్థ:**

★ ఈ భూములను మెఫసాలు అనేవారు. ఉద్యోగులకు, సమాజానికి సేవలు అందించేవారికి ఇచ్చే భూములు. మళ్లీ వీటిలో శ్రోత్రియం, ఖండిక లాంటి ఇనాం భూములుండేవి.

★ ఒక గ్రామం లేదా కొన్ని గ్రామాలను కలిపి మేజర్ ఇనాం (శ్రోత్రియం) గా, గ్రామం కంటే తక్కువ భాగం ఇస్తే మైనర్ ఇనాం (ఖండిక)గా పిలిచేవారు. ఇలా 2.10 లక్షల ఎకరాల భూమి మేజర్ ఇనాందార్ల చేతుల్లో ఉండేది.

**రైత్వారీ విధానం:**

★ మద్రాస్ రాష్ట్రంలో థామస్ మన్రో 1792లో ప్రవేశపెట్టిన ఈ విధానంలో భూమిని సాగుచేసే రైతే ప్రభుత్వానికి ప్రత్యక్షంగా శిస్తు చెల్లించే పద్ధతి అమల్లోకి వచ్చింది. 112 లక్షల ఎకరాల భూమి ఈ విధానం కిందికి వచ్చింది.

★ 20 లేదా 30 సంవత్సరాలకి ఒకసారి భూసారం, ఎకరం ఉత్పత్తి, ఉత్పత్తి వ్యయం మొదలైనవాటిని దృష్టిలో ఉంచుకుని శిస్తు నిర్ణయించేవారు.

★ అయితే రీ-సెటిల్‌మెంట్, నీటి తీరువా పన్ను, నీటిపారుదల సౌకర్యాల మెరుగుదల లాంటి ఇతర పద్ధతుల్లో శిస్తు రేట్లను విపరీతంగా పెంచారు.

★ బెంగాల్ లాండ్ రెవెన్యూ కమిషన్ నివేదిక ప్రకారం జమీందార్లు ఎకరానికి 40 పైసలు చెల్లిస్తే, రైతులు రూ. 2.50 పైసలు చెల్లించేవారు.

★ శిస్తు నగదు రూపంలో చెల్లించాలనే నిబంధనతో రైతులు అప్పుల పాలయ్యారు.

★ ఈ విధానం వల్ల 1931 – 34 మధ్య కోటి ఎకరాలకు పైగా భూమి వ్యవసాయేతర వర్గాల చేతుల్లోకి మారింది. ఈ విధానం వల్ల వ్యవసాయం చేయని యజమానులు 12.5 లక్షలమంది ఉన్నట్లు తేలింది.

★ ఇలాంటి భూస్వామ్య పద్ధతుల వల్ల కొంతమంది వ్యక్తులు, జమీందార్లు, జాగీర్దార్లు, వడ్డీ వ్యాపారులుగా అవతరించగా రైతులు కౌలుదార్లు, వ్యవసాయదార్లుగా మిగిలి పోయారు.

**కౌలు విధానాలు:**

**జిరాయితీ హక్కులు ఉన్నవారు:**

★ జిరాయితీ హక్కులున్న కౌలుదారులకు కౌలు చెల్లిస్తున్నంత కాలం వంశపారంపర్య రక్షణ ఉండేది. అయితే మద్రాస్ రాష్ట్రంలోని మలబార్, తంజావూర్ లాంటి ప్రాంతాల్లో ఉన్న రక్షణలను ఆంధ్ర ప్రాంతానికి వర్తింపజేయలేదు.

★ ఏ హక్కులు లేని కౌలుదార్ల సంఖ్య అధికంగా ఉండటంతో, వారు భూస్వాముల దోపిడీకి గురయ్యారు.

★ మొత్తం ఉత్పత్తిలో 40% నుంచి 60% వరకు భూస్వాములే కౌలు రూపంలో పొందేవారని మద్రాస్ మాజీ ముఖ్యమంత్రి సి. రామస్వామి 1948లో పేర్కొన్నారు.

## భూయాజమాన్య కేంద్రీకరణ

★ మద్రాస్ రాష్ట్రంలో రైత్వారీ ప్రాంతంలో 50 ఎకరాలకు మించి ఉన్న భూస్వాముల సంఖ్య 14 వేలు. వారి యాజమాన్యంలో 19 లక్షల ఎకరాలు ఉండేది.

★ జమీందారీ ప్రాంతంలో 6 జిల్లాల్లో 448 మంది జమీందార్లు ఉండేవారు.

**ఉదా:** తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం భూమిలో 70%, నెల్లూరు జిల్లాలో 50% భూమి జమీందార్ల యాజమాన్యంలో ఉండేది.

★ ఈ విధమైన భూ యాజమాన్య కేంద్రీకరణ వల్లే 'భూ గరిష్ఠ పరిమితి చట్టం' ఆవశ్యకత ఏర్పడింది.

## రాజకీయ పరిణామాలు

★ మొదటి దఫా భూసంస్కరణలకు (1948 – 73) దారితీసిన అతి ముఖ్యమైన రాజకీయ అంశం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీ అయిన అఖిల భారత కాంగ్రెస్ పార్టీ విధానాలు, తీర్మానాలని పేర్కొనవచ్చు.

★ ఆ పార్టీకి చెందిన ఉన్నత విద్యావంతుల రాజకీయ చైతన్యం వల్ల 1885 – 1915 మధ్య సంభవించిన అనేక ఉద్యమాలతో సంస్కరణలకు బీజం పడింది.

★ 1915 రైతాంగ పోరాటంతో ప్రారంభమైన గాంధీజీ రాజకీయ జీవితం కూడా దీనికి నాంది పలికింది.

★ 1919 అమృత్‌సర్ కాంగ్రెస్ సమావేశంలో 'దున్నేవారికే భూమి యజమాన్యం' అనే విప్లవాత్మక తీర్మానం చేశారు.

★ 1928లో జరిగిన అన్ని పార్టీల సదస్సులో భూస్వాముల తొలగింపే కాంగ్రెస్ ప్రధాన కార్యక్రమం అని నెహ్రూ పేర్కొన్నారు.

★ 1929లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీలో గ్రామీణ ప్రజల సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి కొన్ని విప్లవాత్మక సంస్కరణలు అవసరమని తీర్మానించారు.

★ 1931 కరాచీ కాంగ్రెస్ మహాసభలో జమీందారీ వ్యవస్థ రద్దు కోసం తీర్మానం చేశారు.

★ 1936 లక్నో సమావేశంలో ఒక వ్యవసాయ పథకాన్ని రూపొందించి, నాటి ఎన్నికల మేనిఫెస్టోలో భూసంస్కరణలకు ప్రాధాన్యం ఇచ్చారు.

★ 1921లో జరిగిన ఆంధ్ర కాంగ్రెస్ మహాసభ అదనపు శిస్తు పెంపును (కృష్ణా – గోదావరి జిల్లాలు) ఖండించింది.

★ వ్యవసాయదారుల రుణాలు తగ్గించడానికి 'అగ్రికల్చర్ రిలీఫ్ యాక్ట్' రూపొందించారు.

★ 1937 ఎన్నికల్లో రైతాంగానికి సీట్లు కేటాయించాలని ప్రొ. ఎన్.జి. రంగా డిమాండ్ చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రకాశం పంతులు అధ్యక్షతన ఒక కమిటీని నియమించి, మద్రాస్ ఎస్టేట్ లాండ్ బిల్లు 1938ని రూపొందించింది.

★ 1946 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ 1947, నవంబరు 28న జమీందారీ రద్దు బిల్లును ప్రవేశపెట్టింది.

★ స్వాతంత్ర్యానంతరం జరిగిన జయపుర కాంగ్రెస్ సభలో జె.సి. కుమరప్ప అధ్యక్షతన వ్యవసాయ సంస్కరణల కమిటీని ఏర్పాటు చేశారు.

★ 1936 వరకు అధికారంలో ఉన్న జస్టిస్ పార్టీ జమీందారుల ఆధిపత్యంలోని బ్రిటిష్ పాలను సమర్థించింది.

★ గాంధీజీ ఆగమనంతో 1915 – 20 మధ్యకాలంలో కాంగ్రెస్‌లో భూమిలేని పట్టణవాసులు, 1920 – 30లో చిన్న రైతులు, 1930లో మధ్యతరగతి రైతులు ప్రవేశించారు.

★ 1919 నుంచి వ్యవసాయ సంబంధాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులు స్వాతంత్ర్యానంతరం భూసంస్కరణల చట్టాలు ప్రవేశపెట్టాల్సిన నైతిక బాధ్యతను పెంచాయి.

## మాదిరి ప్రశ్నలు

**1.** భూ సంస్కరణలు రావడానికి ప్రధానమైన వ్యవస్థాపూర్వక అంశం ఏది?

1) భూస్వామ్య పద్ధతులు  2) భూ యాజమాన్య కేంద్రీకరణ

3) కౌలు విధానాలు  4) అన్నీ

**2.** భారత రాజ్యాంగంలోని ఏ అధికరణంలో (ఆర్టికల్) భూ సంస్కరణలను పొందుపరిచారు?

1) 36  2) 37  3) 38  4) 39

**3.** జిరాయితీ హక్కులున్న కౌలుదార్లు ఏ ప్రాంతంలో ఉండేవారు?

1) హైదరాబాద్  2) ఆంధ్రా  3) బెంగాల్  4) ఏదీకాదు

**4.** ఆంధ్రా ప్రాంతంలో మధ్యవర్తులు ఎవరు?

1) సంస్థానాధీశులు  2) జాగీర్లు  3) జమీందార్లు  4) సర్ఫేఖాస్‌లు

**5.** ఆంధ్రా ప్రాంతంలో మద్రాస్ శాశ్వత శిస్తు విధానాన్ని అనుసరించి జమీందార్లకు వంశపారంపర్యపు హక్కు ఎప్పుడు లభించింది?

1) 1792  2) 1793  3) 1802  4) 1804

**6.** మద్రాస్ రాష్ట్రంలో థామస్ మన్రో రైత్వారీ విధానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?

1) 1792  2) 1793  3) 1794  4) 1795

**7.** అనుపస్థిత భూస్వాములు ఎవరు?

1) జమీందార్లు  2) జాగీర్దార్లు  3) వడ్డీ వ్యాపారులు  4) వీరందరూ

**8.** ఏ కాంగ్రెస్ మహాసభలో 'దున్నేవారికే భూమి' అనే నినాదం ఇచ్చారు?

1) 1919 అమృత్‌సర్ సమావేశం  2) 1931 కరాచీ సమావేశం

3) 1936 లక్నో సమావేశం  4) ఏదీకాదు

**9.** కుమరప్ప కమిటీ సిఫారసులకు అనుగుణంగా అమల్లోకి వచ్చిన సంస్కరణలేవి?

1) మధ్యవర్తుల తొలగింపు  2) కౌలుదారుల పరిరక్షణ

3) భూకమతాలపై గరిష్ఠ పరిమితి విధింపు  4) అన్నీ

**10.** ఆంధ్రా ప్రాంతంలో జమీందారీ రద్దు చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?

1) 1948  2) 1949  3) 1950  4) 1953

**11.** ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత అన్నిరకాల ఇనాం భూముల రద్దు చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?

1) 1965  2) 1966  3) 1967  4) 1968

**12.** ఆంధ్ర ప్రాంతంలో మధ్యవర్తుల తొలగింపు (జమీందారీ రద్దు) కోసం 1938లో నివేదిక సమర్పించిన కమిటీ ఏది?

1) ప్రకాశం కమిటీ  2) కళా వెంకటరావు కమిటీ

3) ఎన్.జి. రంగా కమిటీ  4) కుమరప్ప కమిటీ

**జవాబులు**

1–4; 2–4; 3–2; 4–3; 5–3; 6–1; 7–4; 8–1; 9–4; 10–3; 11–3; 12–1.

**రచయిత: దాడి నారాయణరావు**